సాక్షి ప్రకాశం

శనివారం | 15 | ఏప్రిల్ | 2023



సముద్రంలో దొంగలు పడ్డారు

జిల్లా పరిధిలోని సముద్ర తీరంలో తమిళనాడు ప్రాంతానికి చెందిన మత్స్యకారులు సోనాబోట్లలో వేటసాగిస్తున్నారు. - 8లో..



గరుడ వాహనంపై చెన్నకేశవుడు

మార్కాపురంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి గరుడ వాహనంపై దర్శనమిచ్చారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 37/26

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సా॥ 06:30 ని॥ శనివారం

సహర్ : ఉ॥ 04:32 ని॥ ఆదివారం

న్యూస్‌రీల్

ఐజీని కలిసిన ఎస్పీ మలికా గర్గ్



ఐజీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో గుంటూరు రేంజ్ ఐజీగా జి.పాలరాజు బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంతో శుక్రవారం ఎస్పీ మలికా గర్గ్ ఐజీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ప్రకాశం భవనంలోకి డీఎంహెచ్ఓ కార్యాలయం

ఒంగోలు అర్బన్: ప్రకాశం భవనంలోని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ (డీఎంహెచ్ఓ) కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. ప్రకాశం భవనంలో గతంలో ఉన్న డీఎంహెచ్ఓ కార్యాలయం మరమ్మతులు అవసరం కావడంతో అక్కడి నుంచి జీజీహెచ్ క్యాజువాలిటీ భవనం మొదటి అంతస్తులోకి మార్చారు. అయితే ప్రకాశం భవనంలో ఉన్న జిల్లా ట్రెజరీ కార్యాలయం ప్రగతి భవనం వద్దకు మార్చడంతో ఆ స్థానంలోకి డీఎంహెచ్ఓ కార్యాలయం మారుస్తున్నారు. సోమవారం నుంచి డీఎంహెచ్ఓ కార్యాలయం ప్రకాశం భవనం నుంచి కార్యకలాపాలు సాగించే అవకాశం ఉంది.


ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

మార్కాపురం: లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పోటీలను స్థానిక ఎస్‌వీకేపీ కళాశాలలో శుక్రవారం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ప్రారంభించారు. పోటీలను తిలకించేందుకు వేలాది మంది ప్రజలు రావటంతో కళాశాల ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఈ పోటీలకు రెండు రాష్ట్రాల నుంచి 10 జతల ఎడ్లు రాగా ఉదయం పోటీలను ప్రారంభించి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో నిలిపివేశారు. సాయంత్రం 5 గంటల నుంచి పోటీలు ప్రారంభమై రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగాయి. కేతగుడిపి, పల్నాడు జిల్లా కొత్తపాలెం, పెద్దారవీడు మండలం ఎస్ కొత్తపల్లి, నంద్యాల జిల్లా వెలుగోడుకు చెందిన జేఎండీ బుల్స్, ఏనుగులదిన్నెపాడు, తిమ్మాపురం, వేములకోట, ఎడ్ల జతలు బండను లాగాయి. ఈ పోటీల్లో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, మార్కెట్ యార్డు చైర్మన్ జీ శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ రంగారెడ్డి, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, జెడ్పీటీసీ నారు బాపన్ రెడ్డి, ఎంపీపీ అరుణచెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా నదిలో మొసలి మృతి



యర్రగొండపాలెం: నల్లమల అటవీ ప్రాంతంలోని కృష్ణానదిలో మొసలి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. యర్రగొండపాలెం మండలంలోని నెక్కంటి రేంజ్ పరిధిలో ఆలాటం–పెద్దరావు మధ్యలో పారుతున్న కృష్ణా నదిలో మొసలి మృతదేహాన్ని అటవీ శాఖాధికారులు శుక్రవారం గుర్తించారు. కృష్ణా నదిలో చేపలు పట్టుకునేవారి వలలో రెండు రోజుల క్రితం మొసలి చిక్కుకొని మృతి చెంది ఉంటుందని గంజివారి పల్లె రేంజ్ అధికారి ఎస్.వి.సుబ్బారావు తెలిపారు. దాదాపు 7సంవత్సరాల వయస్సున్న ఈ మొసలి ఏ విధంగా మృతి చెంది ఉంటుందన్న విషయం గురించి విచారిస్తున్నామన్నారు.

అరుదైన అతిథి.. ఆలివ్ రిడ్లే



సముద్రంలో మత్స్య సంపద మనుగడ సాగించడానికి పరోక్షంగా దోహదపడే తాబేళ్లలో అరుదైన జాతికి చెందిన ఆలివ్ రిడ్లేలు అంతరించే దశలో ఉన్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉన్న సుదీర్ఘ సముద్ర తీరం ఆలివ్ రిడ్లేల సంతానోత్పత్తికి అత్యంత అనుకూలంగా ఉంది. దీంతో వాటిని సంరక్షించే బాధ్యతను భుజానికెత్తుకున్నాయి అటవీ శాఖ, ట్రీఫౌండేషన్. ఈ రెండూ సమన్వయంగా తాబేలు పిల్లల్ని సంరక్షిస్తున్నాయి. అటవీ సిబ్బంది, ట్రీ ఫౌండేషన్ కర్యకర్తలు ఏటా వేలాది తాబేలు గుడ్లను సేకరించి వాటిని పొదిగించి తిరిగి సముద్రంలోకి వదులుతున్నారు.

- సముద్రంలోని మత్స్య సంపదకు ఊపిరి పోస్తున్న ఆలివ్ రిడ్లే తాబేళ్లు
- అంతరించే దశలో ఉన్న తాబేళ్ల సంరక్షణకు అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్ చర్యలు
- రెండు నెలల్లో 10 వేల తాబేలు పిల్లలను సంరక్షించి సముద్రంలోకి
- మరో 6 వేల పిల్లల్ని సముద్రంలోకి పంపించేందుకు రంగం సిద్ధం
- ఆలివ్ రిడ్లే తాబేళ్ల ఉత్పత్తి కేంద్రంగా ఉమ్మడి ప్రకాశం సముద్ర తీర ప్రాంతం
- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 12 తాబేళ్ల సంరక్షణ కేంద్రాల ద్వారా రక్షణ

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: నీటిలోనూ, భూమి మీద జీవించగలిగే తాబేళ్లలో ఆలివ్ రిడ్లే జాతికి చెందినవి అరుదైన జీవులు. సముద్రంలో నాచు పేరుకుపోయి అడుగు భాగానికి ఆక్సిజన్ సక్రమంగా అందదు. ఆలివ్ రిడ్లే తాబేళ్లు ఆ నాచు తినటం ద్వారా మత్స్య సంపదకు ఆక్సిజన్ బాగా అంది సంతానోత్పత్తికి ఆటంకం లేకుండా సాఫీగా సాగిపోతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే సముద్రాన్ని శుభ్రం చేసే పారిశుద్ధ్య కార్మికులు ఈ ఆలివ్ రిడ్లేలు.

తాబేళ్ల ఉత్పత్తి కేంద్రంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా తీరం...

ఉమ్మడి ప్రకాశం జిల్లా సముద్ర తీరం ఆలివ్ రిడ్లే తాబేళ్లకు ఉత్పత్తి కేంద్రంగా ఉంది. తాబేళ్లు తీరం వెంబడి రావటానికి వాటికి కావాల్సిన 30 నుంచి 35 డిగ్రీలు ఉష్ణోగ్రతను ఎంచుకుంటాయి. ఆ ఉష్ణోగ్రత ఉమ్మడి ప్రకాశం జిల్లా సముద్ర తీరం వెంబడి వాటికి దొరుకుతుంది. అందుకే 102 కిలో మీటర్ల మేర ఉన్న ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వందలాది తాబేళ్లు వచ్చి వేలాది గుడ్లు పొదిగి వెళుతుంటాయి. ఏటా సముద్రంలో నవంబర్, డిసెంబర్ నెలల్లో ఆడ, మగ తాబేళ్లు కలుస్తుంటాయి. ఆ తరువాత ఆడ తాబేళ్లు మాత్రమే గుడ్లు పెట్టేందుకు తీరానికి వస్తాయి. జనవరి రెండో వారం నుంచి ఏప్రిల్ రెండో వారం వరకు ఇవి గుడ్లు పెట్టే సీజన్. ఈ తాబేళ్లు జీవితమంతా సముద్రంలోనే గడుపుతాయి. గుడ్లు పెట్టడానికి మాత్రమే సముద్ర తీరం వెంట ఒడ్డుకు వస్తాయి.

100 నుంచి 170 గుడ్ల వరకు ఒక్కో తాబేలు పెడుతుంది:

నదులు, వాగులు, కాలువలు సముద్రంలో కలిసే ప్రాంతాలను తాబేళ్లు గుడ్లు పెట్టేందుకు అనువుగా ఎంచుకుంటాయి. ఒడ్డుకు వచ్చిన తరువాత ఒకటిన్నర అడుగు నుంచి రెండడుగుల వరకు గుంత తవ్వి ఆ గుంతలో గుడ్లను విడుదల చేసి పొదుగుతుంది. ఒక్కో తాబేలు 100 నుంచి 150 గుడ్లు వరకు పెడతాయి. అత్యధికంగా 170 గుడ్లు వరకు పెడతాయి. గుడ్లు పెట్టిన తరువాత ఇసుకతో కప్పివేస్తాయి. అసలు గుడ్లు పెట్టిన ప్రాంతంతో పాటు చుట్టుపక్కల కూడా సంచరించి గుడ్లు ఎక్కడున్నాయో అర్థం కాకుండా కూడా జాగ్రత్తలు తీసుకుని తిరిగి సముద్రంలోకి వెళ్తాయి. ఆ పిల్లలు గుడ్ల నుంచి బయటకు వచ్చి తిరిగి సముద్రంలోకి వెళ్తాయి. అయితే ఈక్రమంలో ఈ పిల్లలు, గుడ్లు ఇతర పక్షులు, జంతువులకు ఆహారంగా మారిపోతుంటాయి. పిల్లలు బతకకపోవడంతో క్రమంగా ఆలివ్ రిడ్లేలు అంతరించే దశకు చేరుకున్నాయి. ఈ ప్రమాదాన్ని గుర్తించిన అటవీ శాఖ ట్రీ ఫౌండేషన్ సహకారంతో వాటి సంరక్షణకు నడుం కట్టింది.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 12 సంరక్షణ కేంద్రాలు:

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ కేంద్రాలు 12 ఉన్నాయి. రెగ్యులర్ అటవీ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా సంరక్షణ ఏర్పాటు చేస్తున్నారు. ట్రీ ఫౌండేషన్ ఇండియా తాబేళ్ల సంరక్షణకు సాంకేతికంగా సాయం అందిస్తుంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని వేటపాలెం మండలంలోని రామాపురం, పొట్టి సుబ్బయ్య పాలెం, రామచంద్రాపురం, చినగంజాం మండలంలోని కుంకుడు చెట్ల పాలెం, ఏటిమొగ, నాగులుప్పలపాడు మండలం చిన్నంగారి పట్టపు పాలెం, ఒంగోలు మండలంలోని చింతాయగారి పాలెం, కొత్తపట్నం మండలంలోని పిన్నివారి పాలెం, ఈతముక్కల పట్టపుపాలెం, సింగరాయకొండ మండలంలోని పాకల పోతయ్యగారి పట్టపు పాలెం, ఉలవపాడు మండలంలోని టెంకాయచెట్ల పాలెం, గుడ్లూరు మండలంలోని కర్లపాలెంలలో తాబేళ్ల సంరక్షణ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో సంరక్షణ కేంద్రంలో ఒక్కో తాబేళ్ల సంరక్షణ దళ సభ్యుడు ఉంటాడు. వీరిని పర్యవేక్షించేందుకు జిల్లాకు ఒక కో ఆర్డినేటర్ కూడా ఉంటాడు.



చెన్నంగారి పట్టపు పాలెంలో తాబేళ్ల సంరక్షణ కేంద్రం వద్ద అటవీ శాఖ అధికారులు, ట్రీ ఫౌండేషన్ సిబ్బంది



హేచరీలో పెట్టిన గుడ్లను పరీక్షిస్తున్న ట్రీ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ సప్రజ ధరణి

ఇప్పటి వరకు 66,639 పిల్లలను సముద్రంలోకి...

2017 సంవత్సరం నుంచి తాబేళ్ల సంరక్షణకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు ఒక్క ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి 66,639 తాబేలు పిల్లలను సంరక్షించి సముద్రంలోకి వదిలారు. ఈ సీజన్‌లో దాదాపు 10 వేల పిల్లలను వదిలారు. మరో 6 వేలకు పైగా పిల్లలను వదిలేందుకు రంగం సిద్ధం చేశారు.

సంవత్సరం	సముద్రంలోకి వదిలిన పిల్లలు
2017	4,500
2018	7,692
2019	7,285
2020	8,513
2021	9,736
2022	18,913
2023 (ఇప్పటి వరకు)	10,000



గుంతలోని గుడ్లను సేకరిస్తున్న సముద్ర తాబేళ్ల సంరక్షణ దళ సభ్యుడు

గుడ్లు అన్యాక్రాంతం కాకుండా చర్యలు

ఆలివ్ రిడ్లే తాబేళ్లు సముద్ర తీరానికి వచ్చి పెట్టిన గుడ్లు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతున్నాం. సముద్ర తాబేళ్ల రక్షణ దళ సభ్యులు జనవరి నుంచి ఏప్రిల్ ఆఖరు వరకు వారికి కేటాయించిన తీరం వెంట తరచూ సంచరిస్తుంటారు. గుడ్లు పెట్టిన ప్రాంతాన్ని గుర్తించి సాంకేతికంగా తీసుకున్న నిర్ణయాల ప్రకారం వాటిని సేకరించి హేచరీ ఏర్పాటు చేసిన సంరక్షణ కేంద్రానికి తీసుకొస్తారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ చూపుతోంది.

– కే.మోహన రావు, డీఎఫ్ఓ, రెగ్యులర్ ఫారెస్ట్, ప్రకాశం జిల్లా

సాంకేతిక పరిజ్ఞానంతో రక్షణ

ఆలివ్ రిడ్లే తాబేళ్లను సంరక్షించటం పర్యావరణాన్ని కాపాడటమే. ఈ జాతి తాబేళ్లు నాచు తినటం వల్ల మత్స్య సంపదకు సంతానోత్పత్తి సమయంలో ఆక్సిజన్ పూర్తిగా అంది మత్స్య సంపద సంతానం పెరగటానికి ఎంతో దోహద పడుతుంది. అందుకోసం సముద్ర తీరం వెంట సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి అక్కడ హేచరీల మాదిరిగా గుడ్లను పొదగబెడతాము. పిల్లలుగా గుడ్ల నుంచి పిగిలిన తరువాత వాటిని సంరక్షించి వారం పది రోజుల్లోనే వాటిని సముద్రంలో వదులుతాం.

– డాక్టర్ సుప్రజా ధరణి, ట్రీ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు

గుడ్ల సేకరణ:

ఆయా కేంద్రాల్లో పనిచేస్తున్న తాబేళ్ల సంరక్షణ దళ సభ్యుడు ఉదయాన్నే సముద్ర తీరం వెంట నాలుగైదు కిలో మీటర్ల మేర నడుచుకుంటూ పర్యవేక్షిస్తాడు. తాబేలు ఒడ్డుకు వచ్చి గుడ్లు పెట్టి తిరిగి సముద్రంలోకి వెళ్లిన అడుగుల ఆధారంగా గుడ్లు పెట్టిన ప్రాంతాన్ని గుర్తిస్తాడు. ఆ గుడ్లను గుడ్ల సంచిలోకి తీసుకుంటాడు. గుడ్లు పెట్టిన సమయంలో తాబేలు ఒక ద్రవాన్ని వదులుతుంది. ఆ ద్రవం ఉన్న ఇసుకను కూడా గుడ్ల వెంట తీసుకొని సంరక్షణ కేంద్రానికి తీసుకొస్తాడు. సంరక్షణ కేంద్రంలో గుడ్లు పొదిగేందుకు వీలుగా, సాంకేతిక పరిజ్ఞానంతో హేచరీని ఏర్పాటు చేస్తారు. గుడ్లు పొదిగిన తరువాత 45 నుంచి 55 రోజుల్లో గుడ్లు నుంచి పిల్లలు బయటకు రావటం ప్రారంభిస్తాయి. వాటిని సంరక్షించి తిరిగి సముద్రంలోకి వదులుతారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో జిల్లా అభివృద్ధి

- త్వరలోనే ఒంగోలులో అంబేడ్కర్ ఆడిటోరియం నిర్మాణ పనులు
- అంబేడ్కర్ జయంతి సభలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి
- అంబేడ్కర్‌కు ఘన నివాళులర్పించిన జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్ తదితరులు

ఒంగోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ స్ఫూర్తితో జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. అంబేడ్కర్ 132వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక హెచ్‌సీఎం కాలేజీ ఎదురుగా, ప్రకాశం భవనం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, నగర మేయర్ గంగాడ సుజాత తదితరులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత జనోద్ధరణకు అంబేడ్కర్ ఎంతగానో పాటుపడ్డారని, అదే కోవలో నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా పాలనసాగిస్తున్నారన్నారు. జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అంబేడ్కర్ చూపిన బాటలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి, అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక వివక్షపై జీవితాంతం పోరాడిన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో జిల్లాను అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ ఇంత బలంగా ఉండేందుకు దూరదృష్టితో ఆలోచించి అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమే కారణమన్నారు. అనంతరం అంబేడ్కర్ భవన్‌లో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి ఉత్సవాలకు జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా సాంఘీక సంక్షేమశాఖ అధికారి ఎస్.లక్ష్మానాయక్, పలు దళిత సంఘాల నాయకులతో కలిసి కేక్‌ను కట్‌చేసి ఉత్సవాలను ప్రారంభించారు. జిల్లాలో ఎస్‌సీ, ఎస్‌టీ వర్గాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను దళిత సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో ప్రస్తావించారు. దళిత చట్టాల అమలుపై దళిత సంఘాలతో జూన్ నెల మొదటి వారంలో ప్రత్యేక సమావేశం పెట్టాలన్నారు. జేసీ వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా మాట్లాడుతూ దళిత సంఘాల నాయకుల విజ్ఞప్తి మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. చనిపోయాక మృతదేహాలను వైద్య విద్యార్థుల ప్రయోగాల కోసం ఒంగోలు రిమ్స్‌కు ఇస్తామంటూ ముందుకు వచ్చిన పలువురు దళిత నాయకులకు ఈ సందర్భంగా సుముఖత పత్రాలను జేసీ అందించారు. ఈ జయంతి ఉత్సవాల్లో జిల్లా ఎస్‌సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, ఏపీఎస్‌సీపీసీఆర్ సభ్యురాలు బి.పద్మావతి, మాజీ ఎమ్మెల్యే కనుకుర్తి ఆదెన్న, దళిత సంఘాల నాయకులు చప్పిడి వెంగళరావు, నీలం నాగేంద్ర, ఉసురుపాటి బ్రహ్మయ్య, బిళ్లా చెన్నయ్య, చప్పిడి రవిశంకర్, కొమ్ము సృజన్, త్రిపురాంతకం జెడ్పీటీసీ జాన్‌పాల్, చంద్రబోస్, బుద్ధకోటి, రఘురామ్, లింగంగుంట్ల రవికుమార్, కత్తి కళ్యాణ్, పేరం సత్యం, మన్నం ప్రసన్నరాజు, జిల్లా ఎస్‌సీ ఎస్‌టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు లక్ష్మయ్య, రమణమ్మ, జిల్లా సఫాయికారుల విజిలెన్స్ కమిటీ సభ్యులు మందా కిషోర్ తదితరులు పాల్గొని బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం అంబేడ్కర్ చేసిన కృషిని కొనియాడారు.

సామాజిక న్యాయం జగన్‌తోనే సాధ్యం



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో కేక్ కట్ చేస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, జంకె వెంకటరెడ్డి, గంగాడ సుజాత తదితరులు

ఒంగోలు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలలుగన్న సామాజిక న్యాయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. స్థానిక శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఎస్‌సీ సెల్ జిల్లా, నగర అధ్యక్షుడు జి.దేవప్రసాద్, పసుమర్తి గోపీ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నగర మేయర్ గంగాడ సుజాతలతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు పెద్ద పీటవేస్తున్నారన్నారు. అణగారిన సామాజిక వర్గాలకు రాజ్యాధికారం లభించాలన్న అంబేద్కర్ కల సాకారం కావాలంటే జగన్‌లాంటి సీఎం రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనలను సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ సమాజంలో అందరు సమానంగా ఉండాలని ఆకాంక్షిస్తూ రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ సమాజంలో అట్టడుగున ఉన్నవారు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగడం ద్వారానే సమానత్వాన్ని సాధించడం సాధ్యపడుతుందని, ఆ దిశగా ప్రభుత్వ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకుంటూ ఆయనకు అండగా ఉందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు, కటారి శంకర్, దామరాజు క్రాంతికుమార్, చింతగుంట్ల సువర్ణ, గంటా రామానాయుడు, నత్తల భీమేష్, కొమ్మూరి రవిచంద్ర, కొప్పోల్ల కమల, మిట్నసల మధు, గంగవరపు ప్రవీణ్‌కుమార్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్, దాసరి కరుణాకర్, దేవరపల్లి అంజిరెడ్డి, చిరంజీవి, కె.విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



పూర్ణాహుతి అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి, పక్కన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు, ఎమ్మెల్యే బలరాం

ధర్మ మార్గంలో పయనిస్తే రాజ్యం సుభిక్షం

- కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి
- యాగాలతో ప్రజలు సుభిక్షం: బాలినేని

ఒంగోలు టౌన్: తరచుగా యాగాది క్రతువు నిర్వహిస్తూ ధర్మ మార్గంలో పయనిస్తే రాజ్యం సుభిక్షంగా ఉంటుందని కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి అన్నారు. ఒంగోలులో నాలుగు రోజులుగా జరుగుతున్న రాజ శ్యామల యాగం చివరి రోజైన శుక్రవారం ఘనంగా జరిగింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కంచి పీఠాధిపతి చేతుల మీదుగా మఠంపల్లి దక్షిణామూర్తి నేతృత్వంలో వేదపండితులు బాలినేని శ్రీనివాసరెడ్డి దంపతులచేత పూర్ణాహుతి కార్యక్రమం పూర్తి చేశారు. ఈ సందర్భంగా యాగ విశిష్టతను వివరించిన ఆయన మహత్తరమైన యాగాన్ని సంకల్పించి, తనచేత పూర్ణాహుతి చేయించినందుకు బాలినేని దంపతులను అభినందించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ధర్మయుక్తంగా వ్యవహరిస్తే జీవన ప్రయాణం బాగుంటుందని చెప్పారు. ప్రజల మేలు కోసం భవిష్యత్తులో కూడా ఇలాంటి యాగాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం భక్తులకు మంగళశాసనాలు అందజేశారు. తొలుత రాజ శ్యామల దేవికి వేద పండితులు బాలినేని దంపతులచేత ప్రాతఃకాల అర్చన, పూర్ణాహుతి చేయించారు. బాలినేని దంపతులకు వేదోక్తంగా కృతికా స్నానాదులు చేయించారు. విజయవంతంగా యాగాన్ని నిర్వహించిన వేదపండితులను ఘనంగా సత్కరించారు.



పూర్ణాహుతిలో కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి, బాలినేని దంపతులు



అలంకరణలో అమ్మవారు

నా భార్యే నాకు అదృష్టం: బాలినేని

నాభార్యే నాకు అదృష్టం అని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. రాజ శ్యామల యాగం చేయిద్దామని తన భార్య శచీ అడిగిందని, వెంటనే చేయించమని చెప్పానని తెలిపారు. ఇలాంటి యాగాల వలన ప్రజంతా సుభిక్షంగా ఉంటారని కంచి స్వాములవారు చెప్పారని, ఇంతటి మంచి కార్యక్రమాన్ని నా చేత చేయించడం నా అదృష్టమని అన్నారు. ప్రతి ఒక్కరిపై అమ్మవారి అనుగ్రహం ఉండాలని ఆకాంక్షించిన ఆయన భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తానన్నారు.

రాజశ్యామల యాగంలో పాల్గొన్న కరణం, శిద్దా

రాజ శ్యామల యాగంలో చీరాల ఎమ్మెల్యే కరణం బాలరాం, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పాల్గొన్నారు. పూర్ణాహుతి కార్యక్రమానికి హాజరైన వారు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి దంపతులకు అభినందనలు తెలిపారు.

సముద్రంలో.. దొంగలు పడ్డారు!



ఈ ఏడాది జనవరిలో పాకల తీరంలో సోనాబోట్లను అడ్డుకుంటున్న మత్స్యకారులు, మెరైన్ పోలీసులు

- సాగరంలో తమిళనాడు సోనాబోట్ల ఆగడాలు
- దశాబ్దాలుగా ఆంధ్ర మత్స్యకారులపై తమిళ జాలర్ల దాడులు
- సోనాబోట్ల ఆగడాలను పట్టించుకోని గత పాలకులు
- మత్స్యకారుల సమస్యలపై స్పందించిన సీఎం జగన్ ప్రభుత్వం
- రెండు సార్లు ఇరు రాష్ట్రాల మధ్య ఒప్పంద చర్చలకు ప్రయత్నం
- కరోనా కారణంగా రద్దయిన ఇరు రాష్ట్రాల సమావేశాలు

సముద్రంలో దొంగలు పడ్డారు. అవును నిజమే. తరచూ తమిళనాడుకు చెందిన మత్స్యకారులు ఆంధ్రా జలాల్లో ప్రవేశించి ఇక్కడి మత్స్య సంపదను దోచుకుంటున్నారు. అత్యాధునిక బోట్లతో మెరుపు వేగంతో సరి'హద్దులు' దాటి వచ్చి గద్దల్లా తన్నుకుపోతున్నారు. కేంద్ర మత్స్యశాఖ నిబంధనలను ధిక్కరించి ఆంధ్ర మత్స్యకారులపై దాడులకు తెగబడుతున్నారు. విలువైన వలలను విధ్వంసం చేస్తున్నారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ దౌర్జన్యకాండకు చెక్ పెట్టేందుకు గత ప్రభుత్వాలు కనీసం స్పందించలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఇటువంటి పరిస్థితి ఎదురుకావడంతో ఆగమేఘాలపై తమిళ ప్రభుత్వంతో ఒప్పంద చర్చలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించింది. కరోనా కారణంగా చర్చలు రెండు దఫాలు వాయిదా పడటం, ఆ తర్వాత ఇటువంటి దాడులు జరగకపోవడంతో మిన్నకుండిపోయాయి. తాజాగా తమిళనాడు సోనాబోట్ల దాడులు జరగడంతో ఆంధ్ర జాలర్లు ఉలిక్కిపడ్డారు.

ఒంగోలు డెస్క్

ఆంధ్రప్రదేశ్ సరిహద్దు సముద్ర జలాల్లో తమిళ జాలర్లు అక్రమంగా చొరబడుతున్నారు. కడలినే నమ్ముకుని సంప్రదాయ వలలతో ఆంధ్రా తీరంలోని ప్రకాశం, నెల్లూరు జిల్లాల మత్స్యకారులు బతుకు పోరాటం చేస్తున్నారు. వీరు వేట సాగించిన మత్స్య సందపను రెప్పపాటులో తమిళ మత్స్య దొంగలు దోచుకుపోతున్నారు. తమిళనాడులోని నాగపట్నం, కడలూరు, పాండిచ్చేరిలోని కారైక్కల్ తీర ప్రాంతాల నుంచి మత్స్య సంపద ఎగుమతి అవుతుంది. ఇక్కడి వ్యాపారులు కొందరు మత్స్యకారులను కూలీలుగా పెట్టుకుని అత్యాధునిక బోట్లు, వలలతో వచ్చి మత్స్య సంపదను కొల్లగొడుతున్నారు.

'హద్దులు' మీరి..

సముద్రంలో వేట సాగించడానికి కేంద్ర మత్స్యశాఖ కొన్ని నిబంధనలు విధించింది. సముద్ర తీర ప్రాంత రాష్ట్రాల మధ్య సరిహద్దులు మీరకూడదనే ఆంక్షలు ఉన్నాయి. ఈ మేరకు.. సాధారణ తెప్పలు, బోట్లతో సముద్ర తీరం నుంచి ఎనిమిది కిలోమీటర్ల (5 నాటికల్ మైళ్లు) వరకు చేపల వేట చేసుకోవచ్చు. బోట్ల సామర్థ్యాన్ని బట్టి మరింత ముందుకు కూడా వెళ్లొచ్చు. ఇంజిన్ బోట్లు అయితే 23 కిలోమీటర్ల(12 నాటికల్ మైళ్లు) అవతలే వేట చేసుకోవాలి. అయితే తమిళ జాలర్లు అంతర్‌రాష్ట్ర సరిహద్దులు దాటి వస్తున్నారు. నిబంధనల ప్రకారం తీరానికి 12 నాటికల్ మైళ్ల అవతల కాకుండా కేవలం 5 నాటికల్ మైళ్లలోపు వేట సాగిస్తున్నారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని మత్స్యకారులు వేట సాగించే చిన్న బోట్లు, తెప్పలను ఢీకొట్టి మరీ మత్స్య సంపదను దోచేస్తున్నారు.

కడలూరు బీచ్ టు కొత్తపట్నం బీచ్

తమిళనాడు రాష్ట్రం కడలూరు బీచ్ నుంచి రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా కొత్తపట్నం బీచ్ వరకు సుమారు 150 నాటికల్ మైళ్ల దూరం ఉంది. తిరుపతి జిల్లా తడ నుంచి ప్రకాశం జిల్లా కొత్తపట్నం వరకు తమిళ మత్స్యకారులు దూసుకొస్తున్నారు. ప్రధానంగా వాకాడు ప్రాంతం గోవిందరావు పట్టపుపాలెం, నెల్లూరు జిల్లా అల్లూరు మండలం ఇస్కపల్లి పట్టపుపాలెం, రామాయపట్నం, చాకిచర్ల పట్టపుపాళెం, జిల్లాలోని ఊళ్లపాళెం, పాకల పట్టపుపాళెం, టంగుటూరు మండలం తాళ్లపాళెం, కొత్తపట్నం బీచ్, మడనూరు ప్రాంతాల్లోనే తమిళనాడు మత్స్యకారులు దాడులకు తెగబడుతున్నారు.

గతంలో తిరుపతి, నెల్లూరు జిల్లాలోని మత్స్యకారులపై కడలూరు మత్స్యకారులు భౌతిక దాడులకు తెగబడ్డారు. ఇటీవల నెల్లూరు జిల్లా అల్లూరు మండలం ఇస్కపల్లి మత్స్యకారులపై సోనాబోట్లలో వచ్చిన తమిళ జాలర్లు రాళ్లదాడికి దిగడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మరువక ముందే తాజాగా జిల్లాలోని పాకల, కొత్తపట్నం మత్స్యకారులపై దాడులకు తెగించేందుకు ప్రయత్నించిన తమిళ జాలర్లను స్థానిక అధికారుల అండతో తరిమికొట్టారు. కడలూరు బోట్లు నాలుగు నుంచి 8 వరకు వస్తుండగా ఈ నెల 9వ తేదీ 20 బోట్లు తీరానికి అతి దగ్గరగా వచ్చి వేట సాగించాయి. దీంతో పాకల మత్స్యకారులు ఈ నెల 11వ తేదీ కడలూరు బోట్లపై 9 పడవల్లో వెళ్లి తరిమికొట్టారు.

వలలు, మత్స్య సంపద నష్టం

జిల్లాలో సుమారు 1,300 మెకనైజ్డ్ బోట్లు, 700 మోటారు లేని బోట్లు ఉన్నాయి. తమిళ జాలర్ల దాడులతో రాష్ట్ర మత్స్యకారులకు చెందిన లక్షలాది రూపాయల వలలు తెగిపోయి ఆర్థికంగా నష్టపోతున్నారు. మెకనైజ్డ్ బోట్లు వేటాడాల్సిన ప్రాంతంలో సోనాబోట్లతో వేట సాగించడం వల్ల మత్స్య సంపద లేక నష్టపోతున్నామని స్థానిక మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చేపల వేట సరిగా లేక పాకల తీరానికే పరిమితమైన బోట్లు

మత్స్య సంపద దొరకడం లేదు



సోనాబోట్ల కారణంగా సంవత్సర కాలంగా చేపల వేట బాగోలేదు. నిబంధనలు అతిక్రమించి సోనాబోట్లు తీరం నుంచి 5 నాటికల్ మైళ్లలోపే వేట సాగించడం వల్ల మాకు మత్స్య సంపద లభించడం లేదు. ఒక రోజు వేటకు వెళ్తే సుమారు రూ.6 వేలు ఖర్చు అవుతుండగా రూ.వెయ్యి నుంచి రూ.2 వేల విలువైన చేపలు, ఎండ్రకాయలు మాత్రమే లభిస్తున్నాయి. ఫలితంగా అప్పుల పాలవుతున్నాం.

– గొల్లపోతు నాగరాజు, బేసిన్‌పల్లెపాళెం, ఊళ్లపాలెం

అప్పుల పాలయ్యా..



గతంలో ఐలా వలతో చేపల వేట సాగించా. కడలూరు బోట్ల పుణ్యమా అని చేపల వేట బాగా లేక అప్పుల పాలయ్యా. ప్రస్తుతం నాన్‌మోటరైజ్డ్ బోటుతో చేపల వేట చేస్తున్నా. ఇటీవల రూ.18 వేలకు వల కొన్నా. రెండు రోజుల్లోపే సోనాబోట్ల కారణంగా వల తెగి సముద్రంలో కొట్టుకుపోయింది. మళ్లీ రూ.16 వేలతో ఇంకో వల కొన్నా. ఈ వల ఎన్ని రోజులు ఉంటుందో అర్థం కావడం లేదు.

– కుమారి ఉత్తరయ్య, పోతయ్యగారి పట్టపుపాలెం, పాకల

కోస్ట్‌గార్డులతో అడ్డుకుంటాం



సోనాబోట్ల కారణంగా మన మత్స్యకారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. సమస్యను రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇరురాష్ట్రాల మంత్రులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తున్నాం. అవసరమైతే విశాఖపట్నంలోని కోస్ట్ గార్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిబంధనలు అతిక్రమించిన సోనాబోట్లపై చర్యలు తీసుకుంటాం.

– ఎ.చంద్రశేఖరరెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి

రూ.లక్షల్లో నష్టం



సోనాబోట్ల కారణంగా లక్షలాది రూపాయల విలువైన వలలు నష్టపోయా. గతంలో ఐలా, రింగు వలలతో చేపల వేట సాగించా. సోనాబోట్ల కారణంగా గత ఏడాది కాలంగా మత్స్య సంపద సరిగా లభించడం లేదు. ఇటు మత్స్య సంపదన పడక, అటు వలలు దెబ్బతిని నష్టపోతున్నాం.

– ప్రళయకావేరి రోశయ్య, పోతయ్యగారి పట్టపుపాళెం, పాకల

ఇరు రాష్ట్రాల మధ్య చర్చలకు యత్నాలు

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంది. నిబంధనలు అతిక్రమించి చేపల వేట సాగిస్తున్న కడలూరు బోట్లను శాశ్వతంగా అడ్డుకుని సమస్య పరిష్కారానికి తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ప్రయత్నాలు ప్రారంభించాయి. 2019, 2022 సంవత్సరాల్లో రెండు సార్లు మత్స్యశాఖ మంత్రులు, రాష్ట్ర స్థాయి అధికారులు సమావేశమయ్యేందుకు ప్రయత్నాలు చేశారు. కరోనా ఆంక్షల నేపథ్యంలో చర్చలు రెండు పర్యాయాలు రద్దయ్యాయి. జిల్లా పర్యటనలో భాగంగా మార్కాపురం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఇచ్చిన ప్రధాన వినతుల్లో సోనాబోట్ల సమస్య ఒకటి. ఈ విషయాన్ని సీఎంఓ కార్యాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారులు తెలిపారు. కలెక్టర్ దినేష్‌కుమార్ కూడా ఈ సమస్యను కోస్ట్‌గార్డ్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు అధికారులు తెలియజేస్తున్నారు.

టమోటా లారీ బోల్తా.. డ్రైవర్ మృతి



మృతుడు గంగిరెడ్డి

మార్కాపురం: మార్కాపురం మండలంలోని రామిరెడ్డి నగర్ ప్రాంతంలో టమోటా లారీ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన శుక్రవారం వేకువజామున 3 గంటల సమయంలో చోటుచేసుకుంది. అనంతపురం జిల్లా కంబదూరు నుంచి టమోటా లోడ్‌తో లారీ మార్కాపురం వస్తోంది. ఈ క్రమంలో రామిరెడ్డినగర్ వద్ద ఎదురుగా వస్తున్న వాహనం లైట్లు డ్రైవర్ జల్లా గంగిరెడ్డి(53) కళ్లలో పడటంతో లారీ అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ గంగిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, క్లీనర్ కనమర్ల శ్రీనుకు గాయాలు కావడంతో జిల్లా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మల్లికార్జున

పొదిలి: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం కర్నూలు రోడ్డులో బాప్టిస్టపాలెం సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. కాటూరివారిపాలేనికి చెందిన చల్లా వెంకటేశ్వర్లు(60) పొదిలి నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై మల్లికార్జున పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పొదిలి సీహెచ్‌సీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

- నివాళులర్పించిన ఎస్పీ మలికా గర్గ్



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ

ఒంగోలు టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధి కోసం పాటుపడాలని ఎస్పీ మలికా గర్గ్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. దేశ ప్రజలు పరస్పర గౌరవంతో కలిసి మెలిసి జీవించాలనే దృఢ సంకల్పంతో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అంకితా సురానా, ఏఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ(క్రైమ్) శ్రీధర్‌రావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, ఎస్బీ డీఎస్పీ బి.మరియదాసు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్బీ సీఐ దేవ ప్రభాకర్, ఆర్ఐలు హరిబాబు, శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

ఎనిమిదేళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నం

లింగసముద్రం: ఎనిమిదేళ్ల బాలికపై ఇంటర్మీడియెట్ చదువుతున్న బాలుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన అన్నెబోయినపల్లి ఎస్సీ కాలనీలో శుక్రవా రం చోటుచేసుకుంది. ఎస్సై ఆవుల వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. ఎస్సీ కాలనీకి చెందిన 8 ఏళ్ల బాలిక స్థానిక పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. పాఠశాల నుంచి వస్తున్న బాలికకు అదే కాలనీకి చెందిన బాలుడు మాయ మాటలు చెప్పి తన ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. బాలిక కేకలు విన్న స్థానికులు అక్కడికి చేరుకోవడంతో బాలుడు పరారయ్యాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాలికను వైద్యపరీక్షల నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

మూడు నెలల క్రితం మహిళ అదృశ్యం..

చెరువులో మృతదేహం లభ్యం



అస్థిపంజరాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాజారావు

పొన్నలూరు: మూడు నెలల క్రితం అదృశ్యమైన మహిళ చెరువులో శవమై తేలింది. ఈ సంఘటన మండలంలోని పెదవెంకన్నపాలెం గ్రామంలో శుక్రవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. పెదవెంకన్నపాలెం ఎస్సీ కాలనీకి చెందిన పిల్లిపోగు కొండమ్మకు కొన్ని నెలలుగా ఆరోగ్యం బాగోలేదు. దీంతో భర్త విలియమ్స్ పలు ఆస్పత్రులకు తీసుకెళ్లి వైద్యం చేయించాడు. అయినా కొండమ్మ ఆరోగ్యం కుదటపడలేదు. దీంతో మనస్థాపానికి గురైన ఆమె కుటుంబ సభ్యులకు భారం కాకూడదనే ఉద్దేశంతో ఈ ఏడాది జనవరి 12వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువుల ఇళ్ల వద్ద, చుట్టుపక్కల గ్రామాల్లో విచారించిన భర్త ఆమె ఆచూకీ తెలియకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా.. శుక్రవారం గ్రామస్తులు కొందరు స్థానిక చెరువులో చేపలు పట్టుకోవడానికి వెళ్లారు. వేసవి కావడంతో చెరువులో కొంత మేర నీటి మట్టం తగ్గడంతో మహిళ అస్థిపంజరం బయటపడింది. ఇది గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. అస్థిపంజరానికి ఉన్న చీరతోపాటు పలు ఆనవాళ్లను బట్టా ఆ మృతదేహం కొండమ్మదిగా కుటుంబ సభ్యులు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దాసరి రాజారావు తెలిపారు.

మద్యం దుకాణం వాచ్‌మన్ దారుణహత్య

- కొండపిలోని మద్దులూరు రోడ్‌లో ఘటన
- నిందితుడి ఆనవాళ్లను గుర్తించిన డాగ్‌స్క్వాడ్
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన దర్శి డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసులు, ఎస్సై రమణయ్య



సంఘటనా స్థలంలో డాగ్ స్క్వాడ్

కొండపి(మర్రిపూడి): ప్రభుత్వ మద్యం దుకాణం వాచ్‌మన్ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన కొండపిలోని మద్దులూరు రోడ్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. పోలిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన సంఘం సుబ్బారెడ్డి(46) గత మూడేళ్లుగా కొండపిలోని మద్దులూరు రోడ్‌లో ప్రభుత్వ మద్యం దుకాణం వాచ్‌మన్‌గా పనిచేస్తున్నారు. గురువారం రాత్రి మద్యం మత్తులో ఉన్న ఓ యువకుడు సుబ్బారెడ్డితో వాగ్వివాదానికి దిగాడు. కొద్ది గంటల తర్వాత గాఢ నిద్రలో ఉన్న సుబ్బారెడ్డి తలపై గుర్తు తెలియని వ్యక్తి పదునైన ఆయుధంతో మోదడంతోపాటు గొంతులో పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం రాత్రి వాగ్వివాదానికి దిగిన యువకుడు గతంలోనూ సుబ్బారెడ్డిని చంపుతానని బెదిరించినట్లు సమాచారం. తెల్లవారినా సుబ్బారెడ్డి నిద్ర లేవకపోవడంతో స్థానికులు గమనించి చనిపోయినట్లు గుర్తించారు. వెంటనే బంధువులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని సీఐ ఎం.శ్రీనివాసులు, డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి పరిశీలించారు. ఆ మార్గంలోని సీసీ ఫుటేజీను తనిఖీ చేయడంతో పాటు క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించిన పోలీసులు నిందితుడి ఆనవాళ్లు గుర్తించారు. టంగుటూరు మండలం పొందూరుకు చెందిన యువకుడే హంతకుడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడు సుబ్బారెడ్డికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వైవీ రమణయ్య తెలిపారు.

గరుడ వాహనంపై విష్ణుమూర్తిగా చెన్నకేశవుడు

- ఆకట్టుకున్న ప్రదర్శనలు
- చెన్నకేశవుని రథోత్సవం నేడు



నగరోత్సవంలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి, నాయకులు



కోలాటం, నాటకాలు, సాంస్కృతిక ప్రదర్శనలు

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారికి గరుడ వాహనోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున గరుడ వాహనంపై శ్రీమహావిష్ణువు అలంకారంలో చెన్నకేశవ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, అర్చక బృందం ప్రత్యేక పూజలు చేశారు. గరుడోత్సవం రోజున మహావిష్ణువు అలంకారంలో చెన్నకేశవ స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, ఆలయ చైర్మన్ పీ.కేశవరావు, ధర్మకర్తలు, పుర ప్రముఖులు, అధికారులు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు:

లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి గరుడోత్సవం సందర్భంగా భజనలు, కోలాటాలు, చిన్నారుల విన్యాసాలు ప్రజలను, భక్తులను ఆకట్టుకున్నాయి.

గజోత్సవం నేడు:

లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారు శనివారం ఉదయం గజవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. స్వామి వారి నగరోత్సవంలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకోవాలని ఈవో కోరారు.

రథోత్సవం నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేతంగా లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారికి అత్యంత వైభవంగా రథోత్సవం శనివారం సాయంత్రం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. భక్తులు రథోత్సవంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని జయప్రదం చేయాలని కోరారు.